# కమల పెండ్లి

జమ్మి శేషగిరిరావుగారు బి. ఎ., యల్. టి.

౧

"అమ్మా! బావ వచ్చేడు!" అంటూ రామారావు వీధులోంచి పరుగెత్తుకు లోపలికి వచ్చేడు. అప్పుడే బావిదగ్గర బట్టలుతుకుకొని దొడ్డివసారాగోడకు మడిబట్ట లారగడుతూ వున్న సోమిదేవమ్మ గబగబ వీధిచావిడిలోకివచ్చి, యెదురుగా కనబడే తన వకవేలువిడిచిన మేనల్లుడిని చూసి "ఎప్పుడూ రావడం? ఎక్కడనుంచీ?" అంటూ పృచ్ఛచేసింది. ఇంతట్లోకే పశువులపాకదొడ్డిలో గొబ్బెళ్లుపెట్టి పూజచేసుకుంటూ వున్న కమలదగ్గరకెళ్లి – రామారావు కొంటెపిల్లాడు కనక – ఆమెతో "కమలా! బావవచ్చేడు" అని రవంతముక్కా వూదేశాడు. అప్పటికి కమల – ఎనిమిదేళ్ల బాలిక – ఏమిచేస్తూందంటే గొబ్బిళ్ల మీద పసుపూ కుంకుమా పువ్వులూపెట్టి

సుబ్బి గొబ్బెమ్మా! సుబ్బణ్ణియ్యావే!
చేమంతి పువ్వంటీ చెల్లెల్నియ్యావే!
తామర పువ్వంటీ తమ్ముణ్ణియ్యావే!
మల్లేపువ్వంటీ మొగుణ్ణియ్యావే!

అంటూ పాటలు పాడుకొంటూంది. "బావ" అన్నమాట వినగానే ఆమె ఆపాటలకి స్వస్తి చెప్పింది. ఎక్కడలేని లజ్జా, మొహాన్ని ఉట్టిపడగా, తన కాలుగోళ్లే తమ్ముడూ ముందుకు తోయ్యగా, ఎల్లాగయితేనేం వీధిసావిట్లోకి వచ్చిచేరింది కమల. చూసింది నరసింహాన్ని.

౨

విశ్వనాథ శాస్త్రిగారికి అయినవల్లిలో ఆరవై యెకరాల మాగాణి వుంది. ఏదో అన్నవస్త్రాలకి లోపంలేకుండా పాడీపంటా, ఆయిదారు పాడిఆవులూ, రెండుమూడు గేదెగొడ్లూ, వక పెద్దధాన్యపుగాదీ వున్నాయి. దీనికి తోడు గ్రామంలో 'శాస్తుర్లు' గారంటే అందరూ చెవి కోసుకుంటారు. వారిమాటంటే నిప్పులోనైనా వురుకుతారు, నీళ్లల్లో దిగమంటే దిగుతారు. అంటే అంత పలుకుబడీ వుందన్నమాట 'శాస్తుర్లు' గారికి. ఆయన వేదాధ్యయనపరులున్నూ నిష్ఠానియమమూ పూర్తిగా వుందనీ ఆయన భార్య వేరే చెబుతోంది. ఇంక పురాతనఆచారాలకీ వ్యవహారాలకీ లోటేమిటి?

మొన్న అక్టోబరు వకటో తారీఖునుంచీ 'శాస్తుర్లు' గారికి మనస్సులో ఆందోళన హెచ్చయింది. ఫాల్గుణమాసందాటితే పద్ధానుగోవేడు వచ్చేదాకా పిల్లకి పెళ్లిచెయ్యడానికి వీలులేదు. వదసాదం పిల్లకి

209

యిప్పుడు ఎనిమిదోయేడు. ఇంతవరకూ సనాతనధర్మప్రకారం "అష్టవర్షా భవేద్గౌరీ-నవవర్షా చ రోహిణీం" అన్నట్టు ఎనిమిదేళ్లూ నిండింతర్వాత పెళ్లి చేయవచ్చునుగదా అని వూరుకున్నాడు. గాని ఇంతట్లోకే తన పుట్టేమి మునిగిపోయిందో అన్నట్లు హరవిలాసశారదాగారు అతిత్వరితంగా తమ "బాల్యవివాహనిషేధక బిల్లు"ను శాసనసభలో ప్రవేశపెట్టి శాసనం చేయించేరు. ఇటువంటి పూర్వాచారపరాయణులందరి మీదా కత్తిగట్టి నట్లుంది శారదాగారు.

విశ్వనాథశాస్త్రిగారు పదిరోజులనుంచీ మరీ యేమీ తోచక తిరుగుతున్నారు. కమలకు తగిన వరుడు ఎక్కడా దొరకడంలేదు. అసలే వైదిక కుటుంబము. అందులో 'శాస్తుర్లు'గారికీ సోమిదేవమ్మగారికీ ఏకపుత్రిక కమల. తమ కేదో ఇంత తినడానికి వున్నది కదా! ఏ బీద వైదిక బ్రాహ్మడికో కట్టబెట్టగూడదా అంటారేమో! అల్లాకాదు. ఇకముందు శారదాగారి హయాములో అయ్యే వివాహాలన్నీ స్వయంగా వరుడు కన్యాన్వేషణమూ, కన్య వరాన్వేషణమూ-ఇత్యాది మంత్రాలతో కూడుకొని కన్యలూ వరులూ-కాబోయే వధూవరులై-ఏ కాలేజీగ్రౌండ్సులోనో, ఏ తియ్యమామిడిగున్నలనీడల్లోనో తమతమ మనోగతాభిప్రాయాలు వెలిబుచ్చుకుని మరీ చెబుతోంటారు పురోహితులకో లేక తల్లిదండ్రులకో తమకు పెళ్లిచెయ్యమని. అయితే యింకా వకటో ఏప్రిలుదాకా శారదాగారి హయాము రాలేదుకదా, మన 'శాస్తుర్లు'గారు కూడా పూర్వపు ఫక్కీనే వరాన్వేషణ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎటువంటి వారికయినా పెరటిలోని కల్పతరువు వెతకినా కనబడదంటారు. అల్లాగ్గా మన 'శాస్తుర్లు' గారి దృక్పథములో నరసింహము పడలేదు. ఎన్ని ప్రయత్నాలన్నా చేశారు 'శాస్తుర్లు'గారు. కోనసీమ అంతా వెదికేరు. చివరకు విసుగెత్తి వూరుకుందామనుకొన్నారు. 'మన కమలకి కళ్యాణం తోసుకొస్తే వరుడు వాడంతట వాడే వచ్చి "మామయ్యా! మీ పిల్లని పెళ్లి చేసుగుంఘానని నన్నడుగుతాడు" అని మనస్సమాధానం చేసుగున్నారు.

ఇంతలో నరసింహము వచ్చేడు క్రిస్టమసు సెలవులికిముందు అయినవల్లి.

## 3

ఇప్పుడు నరసింహానికి పదిహేడేళ్లు. ఇతను రాజమంద్రీలో జూనియరు ఇంటరులో చదువుతున్నాడు. క్లాసుమార్కులు బాగా వస్తోండడం చేత అతిగౌరవంగా చూస్తుంటారు ఇతణ్ణి విద్యార్థులూ, ఉపాధ్యాయులూను. ఆర్ట్సుకాలేజీ విద్యార్థిసంఘమువారి మీటింగులలో బాల్యవివాహ విషయము చర్చకువచ్చింది. కొందరు శారదాగారిని కొనియాడి బాల్యవివాహాలు నిషేధించాలని వాదించేరు. కొందరు సనాతనులని ప్రశంసించి శారదాగారి బిల్లుని ఖండించేరు. అందులో నరసింహం మొదటి వారిలోనే చేరేడు.

నరసింహముది ఉప్పలగుప్తం కాపురము. తండ్రి గతించేడు. తల్లి వక్కర్తె. కొడుకుతోకూడా పట్నవాసపు కాపురము చేయలేక పూర్వీకులు ఏర్పరచిన గ్రామనివాసమే చేస్తూ ఎట్లాగో కాయకష్టపడి జీవయాత్ర గడుపుతోంది. అల్లాచేసి తన కొడుక్కి చదువుకి చాలినంత డబ్బు పంపుతోంది. అయితే నరసింహం అయినా చాలా మంచిపిల్లవాడు. దుబారా ఖర్చులుచేసి యెరగడు. మితవ్యయముతో కాలక్షేపము చేస్తాడు. ఏదురభ్యాసాలులేవు. తినడం, చదువుకోవడం, ఆడుకోవడం తప్ప అల్లరిచిల్లరి వేషాలువేసేవాడు కాడు. కనుకనే తండ్రి ఏమీ గడించి యివ్వక పోయినా తల్లియొక్క దయవలన ఏలాగో రాజమండ్రీబస్తీలో పెద్దచదువు చదువ మొదలుపెట్టినాడు. కాని క్లాసులు దాటినకొద్దీ జీతములు హెచ్చాయి పుస్తకములకు తిండికి డబ్బుసరిపోక యిబ్బందులు పడుతున్నాడు.

నరసింహాము సోమిదేవమ్మకు వకవేలువిడిచిన మేనల్లుడు. అంటే నరసింహాము తండ్రిన్నీ సోమిదేవమ్మ తండ్రిన్నీ అన్నదమ్ముల కొడుకులు. నరసింహాము తండ్రిపోయి నాలుగేళ్లయింది. అప్పుడు చూచిందే గాని సోమిదేవమ్మ యీ మధ్య మళ్లీ చూళ్లేదు నరసింహాన్ని. అప్పుడప్పుడు వుత్తరాలవల్ల మాత్రం క్షేమం తెలుసుకుంటూండేది.

## ౪

ఎందుకు వచ్చాడో నరసింహం అయినవల్లి? అతని సహాధ్యాయి ఒకడు అయినవల్లికాపురం అవడం చేత తాను సెలవులకు యింటికి వెడుతూ నరసింహాన్నికూడా వకనాలు తనతో గడపమన్నాడు. తన బంధువులనుకూడా చూడవచ్చునను కొని బయల్దేరేడు నరసింహం. వీథిలోనే కనపడిన పిల్లవాడిని పోలికపట్టి నరసింహం "అత్తయ్య ఏంచేస్తోంది?" అని అడిగేసరికి యిసకలో ఆడుకొంటూన్న రామారావు లోపలికి పరుగెత్తుకువెళ్లి మాతృదేవతతో "అమ్మా! బావవచ్చాడే" అని సహజమృదులత్వం వెదజల్లే మాటల్తో విన్నవించడం మొదలే చెప్పేముగదా.

ఒకగంటసేపు పిచ్చాపాటీ కబురులు చెప్పుకుంటూ సోమిదేవమ్మ గడిపింది. నరసింహం కొంచెం చిక్కినాడనీ, హోటలుభోజనం సరిగా లేదనీ, చదువువేడనీ, ఏమేమో మాటలతో తన అభిమానాన్ని కనబరిచింది సోమిదేవమ్మ.

ఇంతట్లోనే వచ్చారు 'శాస్త్రుల్లు' గారు ఇంట్లోకి—పంచాంగం చంకని పెట్టుకొని, చెప్పులజోడు చప్పుడు చేసుకుంటూను—ఎవరికో పెళ్లిముహూర్తాలు పెట్టి, పెట్టి.

భోజనాలవేళ ప్రారంభమైంది శారదాబిల్లుపైచర్చ. అక్కడ కాలేజీలో ఎంతకఠినముగా వాదించేడో అంతకంటె ద్విగుణీకృతకాఠిన్యముతో వాదించేడు నరసింహాము 'శాస్త్రుల్లు' గారితో. "నోరెరుగని పిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని" నరసింహామూ, "అయితే సనాతనధర్మం వదులుకోవడమేనా?" అని 'శాస్త్రుల్లు' గారూ—పట్టింపులుపడ్డారు. చివరకు భోజనంచెడింది. 'శాస్త్రుల్లు' గారు ప్రస్తుతపు నవీననాగరికత విద్యార్థికులగు యువకుల అనాచారవ్యవహారములూ మొదలైన వాటిమీద తమకువుండే సహజమైన అసహానాన్ని చూపుతూ తీవ్రముగా మాట్లాడి తమ సనాతనఛాందసం అంతా ఒక్కుమ్మడిని క్రుమ్మరించేరు. పైగా కోపం ఎక్కువై పోయి పులుసూ అన్నం పూర్తిచేయకుండా ఉత్తరాపోశనం పట్టేశారు. శారదాగారే ఎదురుగా ఉంటే ఏంచేసేవారో!

అంతట్లో నరసింహం నీళ్లునమలడం ప్రారంభించి ఏదో అత్తగారికి కష్టంకలగకుండా వుండేటందుకు కొంచెంభుజించేడు. వెంటనే తన తల్లిమాట జ్ఞాపకమువచ్చి సాయంత్రానికి వుప్పులగుప్తం చేరుకున్నాడు.

అకారణంగా 'శాస్త్రుల్లు' గారికి నరసింహంమీద కోపంవచ్చింది. సోమిదేవమ్మ వానికి కమల నిద్దామని ప్రసక్తి తెచ్చేసరికి మండిపడుతూ "శారదాబిల్లును ఆమోదించే ఆవెర్రివెధవకు నాపిల్ల నివ్వను" అన్నాడుశాస్త్రి.

కాని, భార్య శాంతవచనాలచేత కొంచం శాంతించి 'మాఘమిస్టకటి అడ్డువచ్చిందిగాని లేకపోతే మాఘమాసంలోనే చేసేద్దుముగా' అంటూ జవాబిచ్చాడు. పెళ్లిగాదారిలోకివచ్చి సంబంధాలన్నీ ఒకటొకటిగా ఏకరువు పెట్టేడు. ఇందులో కట్నాలగొడవ వకటి. పోనీ లౌక్యవ్యవహారపద్ధతిని కట్నం యిద్దామన్నా బొత్తిగా ఏమాత్రపు ఆస్తిఅయినా లేక కట్నాలుమాత్రం ఒకటిదాటి రెండుమూడు వేలువరకూ

211

అడుగుతున్నారు కొందరు. ఏమిచేయగలడు శాస్త్రి? కొడుకు ఒక్కడేగదా! కూతురూ ఒక్కర్తే. లేక లేక వృద్ధాప్యంలో కలిగిన వారీ యిద్దరుపిల్లలున్నూ. వీరిపెళ్లిళ్లు సలక్షణంగా చేద్దామని వుంది మనస్సులో. ఏలాంచేస్తాడు? విధియెట్లావున్నదో?

౫

మర్నాడు బయల్దేరేడు శాస్త్రి సోమదేవమ్మచే ప్రేరేపింపబడి. ఉప్పలగుప్తం చేరేడు పదిగంటలవ్యేళకి. నరసింహము అప్పుడే గ్రామంలో యెవరితోనో మాటలాడ్డానికి వెళ్లేడు. ఇంట్లో తల్లి ఒక్కర్తే వున్నది. ఆ విడతో ప్రసంగించేడు శాస్త్రి. ఆమె అందరివలె గాక తన పుత్రుని యిష్టమన్నది. భోజనముల వేళకు నరసింహం వచ్చి శాస్త్రిగారిని చూచి ఉచితమర్యాదలు చేశాడు శాస్త్రిగారికి. భోజనసమయంలో యేమీ గలభా కాలేదు. ఈమారు తాంబూలం సేవిస్తూ శాస్త్రిగారు పూరేరు రవంత ముక్కాను. కమలనిచ్చి అయిదురోజులూ పెళ్లిచెయ్యడానికీ సైకిలు, కంచం, వెండిచెంబు, పట్టుబట్టలు, రిస్టువాచీ, చేతిగొలుసు వగైరా లాంఛనములన్నీ జరపడానికీ బియ్యే బియ్యల్ ప్యాసయ్యేవరకూ చదువు చెప్పించడానికీ సంకల్పించుకున్నానని చెప్పేరు శాస్త్రిగారు. నరసింహానికి ఏమనడానికీ తోచిందికాదు. ఇప్పుడు ఎనిమిదేండ్ల పిల్లను చేసుకోవడమా? తన పట్టుదల ప్రకారము పదానుగేళ్లు వచ్చినతర్వాత ఆపిల్లను కాని ఇంకోపిల్లనుకాని చేసుకోవడమా? ఎప్పుడో అంటే లాభంలేదు. ఇప్పుడే జరగాలి. ఇప్పుడు పెళ్లిచేసుకుంటే బియ్యే బియల్ వరకూ తనకు దమ్మిడీ ఖర్చులేకుండా చదువు గడిచిపోతుంది. కాని తన పట్టుదల వ్యర్థమవుతుంది. పెళ్లిచేసుకోడో? ఇటుపక్షాను పూర్తికావడం కష్టం. ధనసహాయ్యం చేసేవారు లేరు. పోనీ ఉద్యోగమేదయినా సంపాదిస్తామంటే సాహుకారు గుమస్తాల నిమిత్తం, ఎలిమెంటరీ స్కూలుమాష్టరుల నిమిత్తం ఆఖరుకు కొన్ని ఆఫీసులలో అటెండరుపనుల నిమిత్తం కూడా బియ్యేలు జోరబడుతూన్న యీ రోజుల్లో ఇంటరువాడిని చూచేదాలయేడీ? ఉద్యోగము దొరక్క పిత్రార్జితపు ఆస్తిలేక తన తల్లిని పోషిస్తూ, తన జీవితం గడుపుకోవడం ఎట్లు? ఇదే సమస్య - చాలాగట్టిసమస్య. 'మనసం' లో పడింది వ్యవహారం.

౬

చాలా తీవ్రంగా ఆలోచించేడు నరసింహం. వుప్పలగుప్తపు దేవాలయంలోకెళ్లి స్వామిసన్నిధిని నాలుగు గంటల్దాకా సాగిలబడివున్నాడు ఆలోచిస్తోను. ఎవరెవరు ఏలాగున చెప్పారో అన్నీ ఆలోచించుకొని చివరకు నాలుగు గంటలకి లేచేడు. శాస్త్రిగారిపిల్లను చేసుకోవడానికే యేర్పరచుకున్నాడు.

ఉన్నతవిద్యాభిలాషయే నరసింహంపట్టుదలను జయించింది. శాస్త్రిగారికి సహజబుద్ధియొక్క గౌరవము తెలిసింది. తాను దూషించినప్పటికి నరసింహం తన్ను గౌరవించి తన కోరకు పట్టుదల వదలుకొన్నాడని విని సంతోషించేరు శాస్త్రిగారు. వెంటనే అయినవల్లిచేరి సోమిదేవమ్మతో చెప్పేరు. ఆవిడ మెంగం చేటంతయింది నిజంగా తనకు నరసింహం అల్లుడవుతాడంటేను.

నరసింహము స్నేహితులందరికీ తెలియడానికయినా అవకాశం లేకుండా మొన్న మార్గశిర మాసములోని ఆఖరులగ్నానికే అయింది నరసింహంపెళ్లి.

నరసింహమూ కమలా దంపతులయినారు. వారికి:—

" శ్రీయను మించు మించొలయు సేవకచాతకలోకమోదసం
ధాయకుడై యుదారకసుణారసవృష్టిదురాపతాపముల్
వాయగజేయుచున్ సకలవాంఛితసస్యము లుల్లసిల్లగా
జేయుచు వేంకటాద్రినివసించు ఘనుం డిడుగాత భద్రముల్."